ప్రమాదకరంగా హైమాస్ట్ లైట్ స్తంభం



తప్పుబట్టి ఇలా..

మల్లాపూర్: మల్లాపూర్ అంబేడ్కర్ భవన్ విగ్రహం వద్దనున్న ఐమాక్స్ విద్యుత్‌స్తంభం కిందిభాగం పూర్తిగా తుప్పుబట్టి ప్రమాదకరంగా మారింది. ఈ స్తంభాన్ని తొలగించాలని అంబేడ్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి రఘువరన్ పలుమార్లు విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా.. స్పందించడం లేదని వాపోయారు. స్తంభం కూలి ప్రమాదం జరగకముందే తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాడు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. శ్రీ దత్త సంగీత నృత్య కళాశాల గురువు దుర్గభవానీ శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. మహాగణపతిమ్, బ్రహ్మాంజలి, అదిగో, అల్లదిగో, తిల్లాన, చేరి యశోదకు, కృష్ణశబ్దం, హిందో తిల్లాన, చక్కని తల్లికి గురుడ గమనా, కృష్ణ కృష్ణ తదితర అంశాలను తపస్వీ, కావ్య, సాన్విక, సిరి చందన, లక్ష్మీసహస్ర, ఆరాధ్యసాయికీర్తన, లక్ష్మీమేఘన, వల్లి తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

బోడుప్పల్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కమిషనర్ శైలజ వివరించారు. నేడు ఉదయం 8.30 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట జెండా వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులచే ఎస్ఎస్ఎస్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఇక్కడ నుంచే 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఉద్యోగులతో పాటు అన్ని కాలనీల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీ వాసులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

రేషన్ పరేషాన్ !

సాంకేతిక ఇబ్బందులతో లబ్ధిదారుల అవస్థలు

- సర్వర్లు మొరాయించడంతో నత్తనడకన రేషన్ పంపిణీ

మల్కాజిగిరి/గౌతంనగర్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు ఒకేసారి మూడునెలల రేషన్ సరుకుల పంపిణీపై సాంకేతిక సమస్యలు నెలకొన్నాయి. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు జూన్, జూలై, ఆగస్టు నెలల కోట బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని సూచనలు చేసింది. కేంద్రప్రభుత్వం సూచనల మేరకు 1న గౌతంనగర్ డివిజన్‌లో ఉన్న సుమారు 10 రేషన్‌షాపుల్లో నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. దీంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల ముందు ఉదయం నుంచే బారులు తీరారు. కాగా సాంకేత కారణాల వల్ల బయోమెట్రిక్ ఇబ్బందులు ఎదురుకావడంతో లబ్ధిదారులు, రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- నియోజకవర్గంలో 105 రేషన్ దుకాణాలు ఉండగా.. తెల్ల రేషన్ కార్డులు మొత్తం 75,994తో పాటు అంథోదయ కార్డులు 1,524 కార్డులు ఉన్నాయి. ఆదివారం మల్కాజిగిరిలో బయోమెట్రిక్ సమస్య లు ఏర్పడ్డాయి. దీంతో రేషన్‌డీలర్లు, లబ్ధిదారులు రేషన్ కోసం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.



రామంతాపూర్‌లో రేషన్ కోసం లబ్ధిదారుల రద్దీ



వాణీనగర్‌లో లబ్ధిదారురాలి నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న రేషన్‌షాప్ నిర్వహకుడు



మల్కాజిగిరిలో..

గందరగోళంగా 3 నెలల రేషన్ పంపిణీ..

రామంతాపూర్ : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని వివిధ రేషన్‌షాపుల్లో ప్రభుత్వ ఆదేశాలనుసారం ఆదివారం 3 నెలల బియ్యం, గోధుమలు రేషన్ పంపిణీ ప్రారంభమైంది. ఈ 3 నెలల రేషన్ ఒకేసారి ఇచ్చేలా ఏర్పాటు చేసిన కొత్త సాఫ్ట్‌వేర్‌తో పాటు ఈ– పాస్ మిషన్‌పై లబ్ధిదారులు మూడుసార్లు తంబ్‌ఇంప్రెషన్ (బొటనవేలు) పెట్టాల్సి రావడంతో పాటు సర్వర్ మొరాయించడంతో 3 నెలల రేషన్ పంపిణీ గందరగోళంగా మారింది.

45 నిమిషాల సమయం..

ఒక్కో లబ్ధిదారుడు రేషన్ తీసుకోవడానికి దాదాపు అరగంట నుంచి 45 నిమిషాల సమయం పట్టడంతో చాలామంది లబ్ధిదారులు ఆందోళనతో వెనుదిరిగి వెళ్లారు. కొంతమంది తమ ఇల్లు ఒకే గదితో ఉందని నెలనెల ఇవ్వాల్సిన రేషన్ ముందుగానే 3 నెలలది ఇస్తే ఇంటికి తీసుకుపోయేదెట్లా.. ఇంట్లో ఎక్కడ పెట్టుకోవాలని వాపోతున్నారు.

రాజిరెడ్డి ఆశయ సాధనకు కృషి

రామంతాపూర్ : తన సోదరుడు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే దివంగత బండారి రాజిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రామంతాపూర్ డివిజన్ పరిధిలోని నేతాజీనగర్ కమ్యూనిటీహాల్‌లో రాజిరెడ్డి స్మారకార్థం మాట్రిక్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనిషి ఆరోగ్యంగా ఉంటేనే అన్ని సాధించగలడని, ప్రతి మనిషి మంచి ఆహారం తీసుకుని వాకింగ్, యోగా ఇతర వ్యాయామాలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్న్య నాగేశ్వర్‌రావు, సర్వబాబుయాదవ్, బోసానిపవన్‌కుమార్, చాంద్‌పాషా పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

అల్వాల్ : మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అన్నారు. డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరనగర్ కాలనీలో రూ.25 లక్షలతో సీసీరోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అతి పెద్ద డివిజన్ మచ్చ బొల్లారంలో అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు నిత్యం కాలనీల్లో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన చోట నూతన రోడ్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నామన్నారు. యాదిరెడ్డి, శీనయ్య, స్వరాజ్‌పాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జావిద్, మల్లారెడ్డి, మనోహర్, రవికుమార్ స్థానిక నేతలు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, సర్వేష్‌యాదవ్, వెంకటేశం, దేవేందర్, వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.



వేంకటేశ్వరకాలనీలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

రామంతాపూర్ : హబ్సిగూడ డివిజన్ రామంతాపూర్ పరిధిలోని నవరంగ్‌గూడ వెంకట్‌రెడ్డినగర్, శ్రీనివాసపురం, తదితర ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి చొరవతో సీఎం రేవంత్‌రెడ్డి రూ. 5.55 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్‌పటేల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. యూత్ కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్ చారి, బాలయ్య, ఉపేందర్‌రెడ్డి, మురళి, మల్లు నాయక్, వాసులక్ష్మి, రజియా, పావని, స్వాతి, నీలిమ పాల్గొన్నారు.



అంజనేయున్ని సేవిస్తే సకల శుభాలు



ప్రతిష్ఠాపనోత్సవంలో డాక్టర్ అన్నదానం చిదంబరశాస్త్రి

మల్కాజిగిరి: ఆంజనేయస్వామిని సేవిస్తే సకల శుభాలు చేకూరుతాయని, ప్రముఖ హనుమత్ ఉపాసకులు డాక్టర్ అన్నదానం చిదంబరశాస్త్రి అన్నారు. ఆదివారం ఓల్డ్ మల్కాజిగిరిలో పునర్నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన అయోధ్య రామమందిర నిర్మాణ సమయంలో స్వయంగా చేయించిన యంత్రానికి ప్రాణప్రతిష్ఠ చేయించి బాలరాముని విగ్రహ ప్రతిష్ఠలో ఉపయోగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత, సమస్యల సుడిగుండం నుంచి బయటపడేందుకు ధైర్యం రావడానికి హనుమంతుడి సేవ ఉపయోగపడుతుందన్నారు. ప్రధాన దాత చింతల మల్లేష్‌గౌడ్, మండల రాధ, నాగరాజు, హనుమయ్య, శోభన్‌బాబు, విజయ్‌కుమార్, దుర్గారాం, ఈవో వెంకన్న తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం 8.15 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కార్పొరేటర్ పర్యటన

ఉప్పల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో స్థానికులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. వర్షం వచ్చినప్పుడల్లా కాలనీల్లోని రోడ్లు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమవుతాయని ఫిర్యాదు చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తామని వివరించారు. బన్నాల ప్రవీణ్, కాలనీ అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులున్నారు.



చిలుకానగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ గీత

కాలనీ సంక్షేమానికి కృషి చేస్తా

అల్వాల్: కాలనీ సంక్షేమానికి కృషి చేస్తానని రైల్వే ఎంప్లాయిస్ కాలనీ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాలనీలో జరిగిన ఎన్నికల్లో ఆయన అధ్యక్షుడిగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా కేపీ.రాజు, కోశాధికారిగా శ్రవణ్‌కుమార్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అల్వాల్ సర్కిల్ పరిధిలో అతిపెద్ద కాలనీగా రైల్వే ఎంప్లాయిస్ కాలనీ ఉందని, కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవడంతో పాటు సర్కిల్‌లో అగ్రగామిగా నిలబెట్టేందుకు సమష్టిగా పనిచేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీని కాలనీవాసులు అభినందించారు.

అనారోగ్యంతో జర్నలిస్టు మృతి

మల్కాజిగిరి: సీనియర్ పాత్రికేయులు పెంటాకర్ శ్రీనివాస్ (54) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదివారం గౌతంనగర్‌లోని ఆయన నివాసంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. రెండున్నర దశాబ్దాలుగా వివిధ పత్రికల్లో పనిచేసిన ఆయన సమాజానికి విశేష సేవలందించారని కొనియాడారు. పద్మారావు, కృష్టారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి నివాళులర్పించి, ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

మహనీయుల ఆశయ సాధనతోనే ప్రగతి





జ్ఞానమాలలో పాల్గొన్న నాయకులు

మల్లాపూర్: నాచారం ఎర్రకుంట బస్తీలో మహనీయుల విగ్రహాలకు 234వ ఆదివారం దండ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ లాంటి మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. వారి ఆశయ సాధనతోనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు. ఆశన్న, గణేష్, కిషోర్ శ్రీరాములు, నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కలలను సాకారం చేద్దాం..

బోడుప్పల్: అంబేడ్కర్ కన్నకలలను సాకారం చేద్దామని, అంబేడ్కర్ ఆశయసాధన రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. ఆదివారం బోడుప్పల్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం 328వ జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. బడుగు, బలహీనవర్గాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి అంబేడ్కర్ కన్న కలలను సాకారం చేసేందుకు కృషి చేయాలన్నారు. మనిషిని ఉన్నత స్థితిలో ఉంచేది చదువేనన్నారు. బొబ్బల లక్ష్మారెడ్డి, బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, యాకయ్య, చిల్ల అంజయ్య, బెక్కం శివ, మోతేరాజు పాల్గొన్నారు.

టెలికాం కాలనీ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న కార్పొరేటర్ సబిత

అల్వాల్: కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితాకిషోర్ అన్నారు. డివిజన్ పరిధిలోని టెలికాం కాలనీలో నూతనంగా ఏర్పాటైన కాలనీ సంక్షేమసంఘం కార్యవర్గం ఆదివారం కార్పొరేటర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సబితాకిషోర్ మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారమయ్యేలా కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రజా చైతన్య కార్యక్రమాలు సైతం నిర్వహించాలన్నారు అనంతరం కాలనీలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కాలనీ ప్రతినిధులు రమణారెడ్డి, కుముదాదేవి, సంజయ్‌కిరణ్, ప్రమోద్‌కుమార్, బ్రహ్మచారి, డీఎస్‌రావు, శోభ, తిలక్, చంద్రిక, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవం

మల్కాజిగిరి: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తాలో సోమవారం ఉదయం 10.30 గంటలకు టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొంటారని, జేఏసీ వెంకన్న తెలిపారు. జాతీయజెండా ఎగురవేసిన అనంతరం గాంధీపార్కులో జరిగే రక్తదానశిబిరం, అన్నప్రసాద వితరణ ప్రారంభిస్తారన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి కాలనీలో కమ్యూనిటీహాల్

ఉప్పల్: డివిజన్ పరిధిలో ప్రతి కాలనీకి కమ్యూనిటీహాల్‌ను నిర్మించనున్నట్లు ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని కావేరినగర్‌లో నిర్మించిన కమ్యూనిటీహాల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి కాలనీకి ఒక కమ్యూనిటీహాల్‌ను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మించిన కమ్యూనిటీహాల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానికులదేనన్నారు. కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వైకే.నాయుడు, బ్రహ్మయ్య, డీవీకే వరప్రసాద్, సల్లా ప్రభాకర్‌రెడ్డి, గొరిగే మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు పరిష్కరించండి

అల్వాల్: ప్రజా సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆర్కేనగర్ కాలనీవాసులు కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేరెడ్‌మెట్ డివిజన్‌కు చెందిన రామకృష్ణాపురం కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి కాలనీలోని సమస్యలను వివరించారు. అంతర్గత రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ నిర్మాణం, పార్కులో సౌకర్యాల కల్పన వంటి సమస్యలను వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని, త్వరలో కాలనీలో పర్యటిస్తానని కాలనీ ప్రతినిధులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆర్ఆర్ మహాపాత్ర, డీకేసింగ్, రమేష్, సునీల్, అభిజిత్ భట్టాచార్య, గౌరీప్రియ, తిరుమల్, నరేందర్, ఎస్‌కే.యాదవ్, గోవింద్, లక్ష్మణ్, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు..

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని గోపాల్‌నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని గోపాల్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. గోపాల్‌నగర్ కాలనీలోని రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ సమస్యలతో పాటు కాలనీవాసులకు ఇతర మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేను గోపాల్‌నగర్ కాలనీవాసులు కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులకు సమస్యలు వివరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేత మేకల రాముయాదవ్, గోపాల్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణకుమార్, కార్యదర్శి నగేష్, సలహాదారులు డీఎస్ఎన్. రాజు, వరసిద్ధి వినాయక ఆలయ చైర్మన్ ఉమామహేశ్వరరావు, కార్యదర్శి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో గోపాల్‌నగర్ కాలనీవాసులు

తాగునీటి సమస్యలపై..

అల్వాల్: కాలనీ సమస్యలను పరిష్కరించాలని నేరెడ్‌మెట్ డివిజన్‌లోని యాప్రాల్ కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలు బస్తీవాసులు తమ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. తాగునీటి సమస్య అధికంగా ఉందని, పలుచోట్ల బోర్‌వెల్ పనిచేయడం లేదన్నారు. వీధిదీపాల మరమ్మతులు చేయాలన్నారు. కుక్కలబెడద అధికంగా ఉండటం వల్ల తరచూ వీధి కుక్కల దాడి జరుగుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటానని, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలనీ ప్రతినిధులు శోభ, సువర్ణ, రాధిక, శిరీష, శ్రీలత, పద్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆర్కేనగర్ వాసులు



యాప్రాల్ కాలనీవాసులతో ఎమ్మెల్యే

వికసించిన బ్రహ్మ కమలం

బోడుప్పల్: చెంగిచర్ల ఎంఎల్‌ఆర్ కాలనీలో నివాసం ఉండే వేణుగోపాల్‌చారి ఇంట్లో బ్రహ్మ కమలం వికసించింది. పెరట్లో పెట్టిన బ్రహ్మ కమలం మొక్కకు పూలు పూసింది. 4 పువ్వులు పూయడంతో స్థానికులు వచ్చి తిలకిస్తున్నారు. అతి శీతల ప్రదేశంలో పెరిగే ఈ మొక్కలు ఈ వాతావరణంలో తట్టుకునేందుకు ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. బ్రహ్మ కమలం పుష్పాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఎన్నో ఔషధగుణాలతో పాటు దైవత్వం ఉందన్నారు. ఈ మొక్క ఇంట్లో ఉంటే శాంతి, సమృద్ధి చేకూరుతాయనే నమ్మకం ప్రజల్లో ఉంది.



'కార్మికులకు అండగా ఉండేది కామ్రేడ్‌లే'

జవహర్‌నగర్: కార్మికుల హక్కుల కోసం పోరాడేది కామ్రేడ్‌లేనని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సాయిబాబా కమాన్ ఆటో యూనియన్ కార్మికుల ఆధ్వర్యంలో ఆదివారం నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కార్పొరేట్ కబంధహస్తాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఆరోపించారు.